# "విసుగు"

## శ్రీ పి. యస్. శాస్త్రి

టైము మూడున్నర. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు నిముషం నిముషం మెల్లిమెల్లిగా నడుస్తూ, గడుస్తూ, నడుస్తూ...హోష్!...నిట్టూర్పు...అనంతం వేళ్ళువిరిచాడు...ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు...లెక్క...బాగోలేదు...పుస్తకంలో పేజీలు త్రిప్పుతున్నాడు...ఒకటి, రెండు, మూడు, నాలుగు అయిదు...హోష్! హోయ్! దేవుడా!...వరండాలో నడుస్తున్నాడు...అడుగులు భారంగా. బద్ధకంగా పడుతున్నాయి. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు...

మెడ విదిల్చాడు. తలత్రిప్పాడు. ఓ కన్నుమూసి రెండోకన్ను తెరిచాడు. రెండోకన్ను మూసి మొదటికన్ను తెరిచాడు. మొదటికన్ను మూసి రెండో కన్ను తెరిచాడు. రెండో కన్ను మూసి మొదటి కన్ను ... ఇలా అనంతంగా ... "డామిట్ చాలు అనంతం!" గట్టిగా పైకి విసుక్కొన్నాడు. చొక్కాగుండీ (బొత్తాము) మెలిగాలాగాడు. రాలేదు. మళ్లీ లాగాడు. కొంచెం కదిలింది. మరికొంచెం,మరికొంచెం,మరికొంచెం, మరికొంచెం... "చాలు బొత్తాము తెగుతుంది!"మనస్సు గర్జించింది!... ఆపేశాడు అనంతం అసంకల్పితంగా!

గోళ్ళు కొరకడం మొదలు పెట్టాడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు మళ్ళీ వొకటి. రెండు, మూడు, నాలుగు, అయిదు... యిపోయాయి! రెండ్చేతులు పది చేతివేళ్ళూ అయిపోయాయి! కాలివేళ్ళు మిగిలాయి.

గది అటూ, యిటూ చూశాడు. ఏమూలా బ్లేడుముక్క వున్నట్టు లేదు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ... నాలుగు దిక్కులూ అయిపోయాయి. పైన కప్పు, క్రింద నేలా, మిగిలాయి. కప్పు కేసి మెడ నిక్కించి చూసాడు, కప్పులా! అక్కడ తాళంకప్ప ప్రక్కనే, బ్లేడుముక్క! హోయ్ హోయ్! దొరికింది!

మళ్ళీ మొదలు గోళ్ళు నరకడం! ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు మళ్ళీ ఒకటి, రెండు, మూడు..., అబ్బా! అస్తమానం పైకి లెక్కెట్టక్కర్లేదు.' మనసు కూకలేసింది...అదీ అయిపోయింది!...

గ్లాసులోకి నీళ్ళు వొంపాడు, కూజాలోంచి. బుడ బుడా శబ్దం అవుతోంది. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు...గ్లాసు నిండి నీళ్ళు నేలమీద పొర్లిపోతున్నాయి. సముద్రాలు భీకరంగా ఘోషిస్తూ నేలను ముంచేయడానికి త్రోసుకువస్తున్నాయి. ఖండాలన్నీ నీటిలో మునిగిపోతున్నాయి. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, ఆమెరికా, ఆస్ట్రేలియా... ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు... మునిగి పోతున్నాయి వటపత్రంపై శయనించిన బాలుడు, చిలిపిగా కళ్ళుమూస్తూ తెరుస్తూ కాలి బొటనవేళ్ళు నోటితో చీకుతూ, నిర్మలంగా, నిశ్చలంగా, కాంతిలో మెరుస్తున్నాడు...నీళ్ళు పాదాలను తడిపాయి. కాళ్ళు వెనక్కు లాక్కున్నాడు... కళ్ళముందున్న రూపం కనుమరుగైంది ... కూజావెనక్కు పెట్టాడు. గ్లాసెత్తి నీళ్ళు గొంతులో పోసుకుని గుటకలు వేస్తున్నాడు. ఒకటి, రెండు, మూడు నాలుగు, అయిదు... "గొంతు నీటితోన నిండిపోతోంది!"...

మెల్లిగా భారంగా అడుగుతీస్తూ చాపమీదకుచేరి నడుం వాల్చాడు. చేతివేళ్ళు చిటుకూ చిటుకూ విరవటం మొదలెట్టాడు. ఒకటి రెండు మూడు నాలుగు... మళ్ళీ వొకటి రెండు మూడు... నాలుగు...అయిదు...

కనురెప్పలు మూసాడు ... తలుపుచప్పుడైంది ... నీరసం, బద్ధకం, జోడింపబడిన గొంతుకతో టెలిగ్రాం మెసెంజరు, "టెలిగ్రాం ప్లీజ్!" అంటూ ఉలిక్కిపడిన అనంతం కంగారుగా

లేచి సంతకంపెట్టి కవరు విప్పాడు. "స్టార్ట్ యిమీడియట్లీ – శంకరం"...

గడియారంవైపు చూసాడు మూడూనలభై. రెలి(గాం కాయితంవైపు చూశాడు. గది నాలుగుమూలలా చూశాడు. చెవి మెలితిప్పుకున్నాడు. నెత్తిమీద మొట్టుకున్నాడు. అరచేతులకేసి చూసుకున్నాడు. కాగితంలోని అక్షరాల్ని మళ్ళీ చదవటం మొదలెట్టాడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు ... మళ్ళీ ఒకటి...

"స్టాఫ్! శంకరం ఎవరో గుర్తుకు తెచ్చుకో!" ఏ మూలనుంచో అజ్ఞాతశక్తి హెచ్చరించింది. శంకరం ... ఉమా శంకరం...రమాశంకరం...ఎవరీ శంకరం ?... జవాబు మనోఫలకం మీద నేనా తళుక్కువ మెరవాలి, మిస్ శకుంతలా 'దీ మాథ మెటిక్స్ ప్రాడిజీకిలా, లేదా బుర్రలో మెరుపు మెరిసినట్టైనా గుర్తుకు రావాలి, జీవియస్సులకిలా !... అదీలేదు యిదీలేదు ఇదీ లేదు, అదీ లేదు, అదీలే...యిదీలే... ఇది అనంతం! 'అవును నీపేరనంతం !' మనస్సు హెచ్చరించింది.

కళ్ళు మూసుకుని శంకరాలని గుర్తుకుతెచ్చుకోసాగేడు. "శంకర శంకర ఉమాపతే! భవానీశంకర భక్త వశంకర, శంకర..." స్టాప్! దొరికాడు 'భవానీశంకరం!... అమ్మయ్య! రెండు నెలల క్రిందట యీ వూరొచ్చినప్పుడు, తన సొదంతా చెప్పుకున్నప్పుడు "నేను నీ సంగతి తప్పకుండా కనుక్కుంటా. నేను టెలిగ్రామివ్వగానే బయలుదేరిరా!" అన్నాడు...అతనే "భ॥శంకర!!"...

...అన్నట్టుగానే టెలిగ్రామిచ్చాడు. తను యీలోపల అతని సంగతే మరచిపోయాడు! "ఫన్నీ!" కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతూంటే వెర్రిగా నవ్వుకున్నాడు. "ఫన్నీ! వెరీ వెరీఫన్నీ!"... ఎలాగైనా వూరు బయలుదేరాలి. గడియారంవైపుకు చూసాడు మూడూయాభై. నాలుగుంపావుకు (ట్రెయినుంది. అలోగా డబ్బు సంపాదించాలి; టిక్కట్టుకు ... పెట్టెలో సామానంతా (క్రింద బోర్లించాడు. బట్టలన్నీ విడి, విడిగా తీసి దులిపాడు, టంగ్, టంగ్... నాణాల చప్పుడు...ఒకటి, రెండు, మూడు... మొత్తం అయిదు పదిపైసల బిళ్ళలు...అలమారు వెతికాడు... దుమ్ముకొంచెం కొంచెంగా పొరలు, పొరలుగా పేరుకుంటోంది. పుస్తకాల్క్రింద కాయితం మడతలు. ఆత్రుతగా విప్పాడు. అడ్రసులు, అడ్రసులు, అడ్రసులు, వ్యక్తులవి, సంస్థలవి... ఎన్నో!...

గదిఅంతా క్షుణ్ణంగా పరిశీలించాడు. ట్రంకుపెట్టి, అలమారు చాప, కూజా, బట్టలదణ్ణెం! ... బట్టలదణ్ణెం దగ్గరకువెళ్ళి జేబులు డిటెక్టివ్‌లా పరిశోధించసాగాడు. చిన్ని చిన్ని కాగితం ముక్కలు, సిటీబస్సు టిక్కెట్లు కొన్ని, సినిమా టిక్కెట్లుకొన్ని. నీరసం వచ్చేస్తోంది. కనీసం పదిరూపాయలులేందే ప్రయాణం కుదరదు!...

"టిక్! టిక్! టిక్!" చప్పుడు...ఆగకుండా అదీ కాల పురుషుని గుండె చప్పుడు!... గడియారంకేసి చూశాడు... కాలం మూడు మీద యాభై అయిదు..., మూడూ యాభై అయిదు ... అవును!...

మళ్ళీ గడియారంకేసి చూశాడు ... ఇంకోసారి చూశాడు! ఇంకోసారి!...ఈ గడియారం తాకట్టు పెడితే...అమ్మో! మళ్ళీ తను దాన్ని విడిపించుకోగలడా? ...కాని భవానీ శంకరం దగ్గరకు వెళ్ళక పోతే!...ఎలాగ? వెళ్ళి తీరాలి!...

టిక్, టిక్, టిక్, టిక్, గడియారం చప్పుడూ తన గుండె మ్రోతా కలిసిపోయాయి. క్షణక్షణానికీ శబ్దం, ఘోరంగా భయంకరంగా, మరీ దగ్గరగా వినిపిస్తోంది...తేల్చేసుకోవాలి...ఇంక టైము లేదు...

గడియారంవైపు చూశాడు. మూడూ యాభైయేడు!... ఒణికే చేతుల్తో గడియారం పట్టుకున్నాడు. తన చేతి(వేళ్ళు టిక్, టిక్, శబ్దానికి అదురుతున్నాయి ఒకటి, రెండు, మూడు, గబ గబా అడుగులు వేసాడు గుమ్మంవైపుకు.

కాలికి గడప తగిలింది. తూలాడు. ముందుకు పడ్డాడు. 'ఛన్' మని చప్పుడైంది...గడియారం పగిలిపోయింది!...అయిపోయింది, అంతా అయిపోయింది ఆఖరి ఆశకూడా తీరిపోయింది... అనంతం ఏడుస్తున్నాడు...ఏడవటానికి ఓపికలేకపోయినా ఏడుస్తున్నాడు...కన్నీళ్ళు చెంపలమీదనుంచి ధారంగా ప్రవహిస్తున్నాయి.

...కన్నీళ్ళ వుర్నకు అనంతానికి మెలకువ వొచ్చింది. చేతితో తుడుచుకొన్నాడు...గదిలో టిక్, టిక్, శబ్దం వినిపిస్తోంది...ఎక్కడి

దీ శబ్దం? ఈ శబ్దం ఎక్కడిది? అక్కడే!

గడియారంవైపు చూశాడు. మసక చీకట్లో రేడియం డైలు మెరుస్తోంది. టైము అయిదున్నర!...అంటే. అంటే...ఇదంతా... "ఏం మొహం! అర్థం కాలేదా ఇంకా!" మనస్సు తిట్టింది.

పొద్దై పోవని, గడియారానికి సంతోషించాలో, రాని అహ్వానానికి చింతించాలో తెలియని అనంతం కళ్ళు గదివైపుకు మరల్చాడు!

కీచుమనే శబ్దం కప్పునుంచి వినిపించడం ప్రారంభమైంది. అంటే సాయంత్రం అయింది. మరి కాస్సేపట్లో చీకటి పడుతుంది!...

ఈ రోజుకు పోస్టుమాన్ రాలేదు టెలిగ్రాం మెసెంజరేనా రాలేదు! అంటే మళ్ళీ రేపు డెలివరీ టయిము వరకూ నిరీక్షణ!" ఈ అనంతకాల నిరీక్షణలో, ప్రభూ! యీ 'అనంతపు' జీవితసుమం వాడిపోతుంది!"...

నీరసంగా చాపమీంచి లేచాడు అనంతం. భోజనపు టిక్కెట్టు అయిపోయి ఆరు రోజులైంది. అయ్యరు అరువిచ్చి అయిదు రోబులు దాటింది. అయ్యరు అనుమానపు చూపులి తట్టుకుంటూ మరోపూట భోజనం చెయ్యాలి...

టిక్, టిక్,టిక్ గడియారం వడుస్తోంది. చేతి వేళ్ళు మడుస్తూ అనంతం లెక్కపెడుతున్నాడు...ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు...మళ్ళీ వొకటి రెండు మూడు నాలుగు అయిదు... దగ్గబోయాడు అనంతం, గొంతు పెగల్చుకునేటందుకు... ఒకసారి, రెండోసారి, మూడోసారి, నాలుగోసారి, రాలేదు;... బలవంతాన దగ్గబోయాడు, వెర్రినవ్వు వచ్చింది, దాని బదులు !

మళ్ళీ ప్రారంభం, ఒకటి రెండు, మూడు, నాలుగు, అయిదు; నిమిషాలు లెక్కబెట టం...గోళ్ళు కొరుక్కోడానికి అలవాటుగా చేయి నోటి దగ్గరగా వెళ్ళింది...ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు మళ్ళీ అదేవరస! ఒక్క గోరూలేదు! ఏం చెయ్యాలి? ... రెండు, మూడు...అంకెలు...

"రాదు! రాదు! నీకు మనీఆర్డరు రాదు! లేదు! లేదు! నీకు ఉద్యోగం దొరికే గీతలేదు!" ఎక్కణ్ణుంచో వికటాట్టహాసం వినిపించింది.

మెల్లిగా అనంతం వొక దిక్కుకు చూశాడు. తరువాత రెండో దిక్కుకు ఆ తరువాత మూడో....ఇలా అన్నీ అయిపోయాయి! ఎక్కడా ఆ మాటలన్న శక్తి కనిపించలేదు...ఇవాళ కాకపోతే, రేపు, కాకపోతే ఎల్లుండి, కాకపోతే ..ఎప్పుడో నాకు అపాయింటుమెంటు ఆర్డరు చేతికొస్తుంది...ఇవాళ సాయంత్రం, కాకపోతే రేపు ఉదయం, కాకపోతే రేపు సాయంత్రం, మనిఆర్డరు వస్తుంది..'అనంతం తనకు తనే ధైర్యం చెప్పుకున్నాడు...ఫేంటు, షర్టు, బనీను, అన్నీ వరసగా తీసి వొంటిమీద నొకటి వెనుక ఒకటి, వొకటి రెండూ మూడూ అంటూ తగిలించుకున్నాడు. ఒకటి, రెండు, మూడు నాలుగు అయిదు అంటూ, గదికి తాళంవేసి, అడుగులు లెక్కపెడుతున్నాడు.

